
ఓం నారాయణ ఓం ఆదినారాయణ

శ్రీశ్రీశ్రీ భగవాన్ వెంకయ్యస్వాముల వారి జీవిత సంగ్రహము

దిక్కాలాద్యనవచ్ఛిన్నానంత చిన్మాత్రమూర్తయే
స్వానుభూత్యేకమానాయ నమశ్శాంతాయ తేజసే॥



అంకితం

వెంకయ్యస్వామి శ్రీపద
పంకజముల కంకితముగ భవతారక క
ర్మాంకముగ నర్పణము మో
హాంకురముల జన్మమాయమై పోవుటకై।

ఓం తత్ సత్

-: రచయిత :-

విద్వాన్ కూరపాటి లింగరాజు

అభివందనము

దీన మానవ లోకాన్ని సముద్ధరించుటకు అప్పుడప్పుడు దైవాంశ సంభూతులు, త్రికాలవేదులు, స్వరూప జ్ఞాన సంపన్నులు, అమోఘ వచస్కులు, అమేయ ప్రభావ ప్రభాకరులు అయిన మహనీయులు, తపస్సిద్ధులు, యోగి సత్తములు, అవధూత శ్రేష్ఠులు అవతరిస్తూ ఉంటారను సత్యోక్తికి - ఆబాల గోపాలముచే అహర్ధహము అమిత భక్తి భావముతో సమర్చనలందుకొనుచూ "గొలగమూడి స్వామి"గా సుప్రసిద్ధులైన అవధూతావతంసులు భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వాములవారి చరిత్ర ప్రత్యక్ష నిదర్శనము.

ఆర్త జనోద్ధారకుడుగా, అర్థి జనకల్పకముగా, ఆపద్బాంధవుడుగా, భక్త వరదుడుగా, నతజన హృదయాధి దేవతగా సమాధి స్థితుడైన పిమ్మట గూడ అశేష భక్తజనుల మొరల నాలకిస్తూ అభీష్ట ప్రదాతయై అనుగ్రహిస్తూ కుగ్రామమైన గొలగమూడిని ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రముగ సుప్రథిత మొనర్చుచున్న ఆ బ్రహ్మభూతుని జీవిత చరిత్రమును, మాహాత్మ్యమును గూర్చిన యీ చిరు కబ్బమును రచించి అందిస్తున్నవారు లబ్ద ప్రతిష్ఠులైన విద్వత్కవులు విద్వాన్ శ్రీ కూరపాటి లింగరాజుగారు.

II

భక్తి భావ నిర్భరమైన సుకృతి అందరికీ సుబోధకం కావ డానికి సులభ సుందరము, సుస్పష్టమూ అయిన భాషలో అనవద్య హృద్యంగా, పద్య గద్యాత్మకంగా "సూక్తి వై చిత్రి మెరయ"వి రచించిన లింగరాజుగారు సంస్కృతాంధ్ర భాషా కోవిదులు. విద్యాల యాలలో తెలుగు పండితులుగా, సద్బోధకులుగా ప్రశంసలు చూర గొన్న ప్రాజ్ఞవతంసులు ఇంతకు మున్ను పెనుశిల లక్ష్మీ నృసింహ దేవునిపై "కరుణా లహరీ" శతకాన్ని రచించి భక్త జన ముల మనముల సుస్థానమును పొందినవారు. పద్యమును, గద్య మును సమాన స్థాయిలో అటు ప్రౌఢంగాను, ఇటు సులభంగాను రచించి మెప్పింపగల సమర్థులు.

అందరికీ సులభంగా అవగతం కావాలన్న ఆకాంక్షతో మనోజ్ఞంగా రచించిన ఈ పుస్తకము పరిమాణమున చిన్నదైనను, ప్రమాణమున మిన్నయే. ఒక్కొక్క పద్యం భక్తి భావ సంభరితమై పఠితలను పారవశ్య మొనరించుననుటలో అత్యుక్తి లేదు. శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామి రచయితలో ఆవేశించినారా అనిపిస్తుంది. ఆస్తిక మహాశయులెల్లరు అవశ్యము పఠించి భగవాన్ వెంకయ్యస్వామి సత్కృపకు పాత్రులు కాగలరని ఆకాంక్షిస్తూ ఈరెండు మాటలు వ్రాయుటకు అవకాశము కలిగించిన రచయితకు అభివందనలంద జేస్తున్నాను.

"ఓం తత్సత్"

అగస్త్యరెడ్డి వెంకురెడ్డి
6—10—90

డా॥ ఉడాలి నరసింహశాస్త్రి M. A. Phd

ఆంధ్ర భాషోపన్యాసకులు
వేద సంస్కృత కళాశాల.

మూలాపేట–నెల్లూరు
తే 29–8–1990 ది

అక్షర జ్యోతి

ఈ లఘు కావ్యం ఒక అవధూత యొక్క జీవితముగూర్చి తెలుపుచున్నది. రచయిత శ్రీ కూరపాటి లింగరాజుగారు. సాహితీ వ్యాసంగం ద్వారా వీరు నాకు సుపరిచితులు. సరళకవి. వీరు శతకము మున్నగు వాఙ్మయ ప్రక్రియలు రచించియున్నారు. రచన చేయుచున్నారు కూడా. వీరు వ్రాసిన ఈ చిఱుకబ్బం శ్రీ గొలగమూడి వెంకయ్యస్వామి జీవిత సంగ్రహం శ్రీ వెంకయ్యస్వామి వారు అవధూత. అవధూతకు భాగవతంలో లక్షణము ఇట్లు చెప్పబడియున్నది.

శ్లో॥ యోవిలంఘ్యాశ్రమాన్ వర్ణాన్ ఆత్మన్యేవ స్థితః పుమాన్
అతివర్ణాశ్రమీ యోగీ అవధూత స్సవుచ్యతే॥

అనగా వర్ణాశ్రమ ధర్మముల స్థాయిని దాటి కేవలము ఆత్మ నిష్ఠాగరిష్ఠుడైయున్న గొప్ప జ్ఞానయోగిని అవధూత అందురు. మరియు అవధూత శబ్దోత్పత్తిని వివరించుచూ........

శ్లో॥ అక్షరత్వాత్ వరేణ్యత్వాత్ ధూత సంసార బంధనాత్
తత్వ మస్యర్ధ సిద్ధత్వాత్ అవధూతోభి ధీ యతే॥

అనగా అవధూతలోని అకారమునకు నాశములేదని వకారమునకు మిక్కిలి శ్రేష్ఠమైనదని ధూ అను అక్షరమునకు సంసార బంధమునుండి విడువబడినదని తకారమునకు తత్త్వ మస్యాది మహా వాక్యార్ధ సిద్ధమైన జ్ఞానము కలిగివుండుటయని ఇట్టి విశేష గుణములు కలవానిని అవధూత యందురు. సారాంశ మేమనగా భౌతికమైన సాధన లేకుండా కర్మ శేషాన్ని సామాన్య మానవునివలె అనుభవించి తరించిపోవుట అని భావము. అనాదిగా మానవుడు భగవత్సేవతో తరించుట జరుగుచున్నది. కానీ నేడు దానికి తోడు సిద్ధపురుషుల అవధూతల సేవలు చేసి జీవితమును పునీతం చేసుకొను సంప్రదాయము ఏర్పడినది. ఈ అవధూతలు, సిద్ధ పురుషులు లోక కళ్యాణము కొరకు అవతరించుచున్నారను అభిప్రాయం ఆస్తికులలో ఏర్పడియున్నది. వీరిని లౌకికులు సంస్కర్తలని, ఆస్తికులు అవతార పురుషులని అందురు. ఇట్టికోవకు చెందినవారే షిర్డి సాయి బాబా, బ్రహ్మంగారు, సర్వజ్ఞుడు, అవధూతేంద్రస్వామి, పుట్టపర్తి సత్య సాయిబాబా మున్నగువారు. సమాజ సంస్కారమే అవతార పురుషులు చేయుచున్న ప్రయత్నము. ఈ సంస్కారమునకు భక్తి ఒక సాధనం. భక్తి మార్గము నిరాడంబర పూజా విధానమును, వర్ణ రాహిత్యమును, ఏకేశ్వరార్చనను, నిర్గుణారాధనను బోధించును పలు సమస్యలతో గూడిన మానవ జీవితము ఇటు రోగాలతో, అటు సంసార బాధలతో సతమతమవుతున్నది. వీటినుండి ముక్తి పొందుటకు ప్రశాంతత అవసరం. అట్టి ప్రశాంతతకు సిద్ధ పురుషుల.

అవధూతల సేవలు అవసరమైయున్నది. ఇట్టి దృక్పథంతో ఏర్పడి నదే అవధూతల సేవలు శిష్యరికాలు. ఇట్టి కోవకు చెందిన శ్రీ వెంకయ్యస్వామి నెల్లూరుజిల్లా చేజర్ల మండలములో నాగ వెల్లటూరులోని పిచ్చమ్మ, పెంచలయ్య దంపతులకు వారి నోముల పంటగా అవతరించిన పుత్ర రత్నము. వీరు చిన్నతనములోనే గామ సమీపపు అడవులలో ఏకాంతముగా ధ్యానం చేసుకొనుచూ, వుండెడివారు. వీరి బాల్యంలో ఒక సాధువు వీరి ఇంటికి వచ్చి స్వామివారి చేతితో పాలు త్రాగి స్వామివారి నాలుకపై మంత్రాక్షరములు వ్రాసినారట. దానితో వారి జీవితం మలుపు తిరిగి అవధూతగా మారి కొన్ని గ్రామాలు సందర్శించినారు ఆశ్రమాలు ఏర్పరచినారు. శిష్యులు తయారయినారు. వారు ఎంత నిరాడంబరులంటే వారి ఆసనం ఈతాకు చాప. భోజనపాత్ర తాటి రేక లేక అల్యూమినియం పాత్ర. వీరు వెళ్ళిన చోట్లలో అగ్ని గుండాలు ఏర్పాటు చేసెడివారు. దీనికి కారణము అగ్ని గృహ దేవత. అగ్ని పవిత్రతకు సంకేతం దీనికి ఆశ్రయాశి అని పేరు. అంటే తనకు ఏది ఆశ్రయమో దానిని గూడ అది తిని వేయును. పరిసర కాలుష్య నిర్మూలనలో దీని స్థానము గొప్పది. మానవుని జ్ఞాన సత్యాలకు ఇది ప్రతీక. కర్మకాండకు సాక్షి భూతమైనది. ఋగ్వేదంలో "అగ్నిమీళే పురోహితం" అనే మంత్రము అగ్ని మనయొక్క మేలును కోరేదని మనకు మార్గదర్శకమని తెలుపుచున్నది. ఆ భావంతో అవధూతలు అగ్నిగుండాలను అవిచ్ఛిన్నముగా కాపాడుచున్నారు. అదేవిధముగా వెంకయ్యస్వామివారు కూడా ఈ అగ్నిగుండమును కాపాడుతుండినారు చివరకు స్వామివారు నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలములోని గొలగమూడి గ్రామ లో

స్థిరపడి ఆశ్రమం ఏర్పరచుకొనిరి. ఇచ్చట అగ్ని నిరంతరం ప్రజ్వరిల్లుచునేయున్నది. అక్షయపాత్రవంటి వారి మహిమలను ఎందరో భక్తులు అందుకొని తరించిరి. వారిచ్చిన విభూతితో, దారముతో, కరస్పర్శతో వేలాది భక్తులు రోగమునుండి కష్టముల నుండి విముక్తి పొందిరి. స్వామివారు 24-8-82 నాడు బ్రహ్మైక్యం చెందిరి. భౌతికంగా వారు మనవద్ద లేకపోయినను నేడు వారి సమాధిని, అగ్నిగుండమును ప్రదక్షిణంచేసి భక్తులు ఎందరో తరించుచున్నారు. స్వప్న దర్శనం పొందుచున్నారు. దీన జనోద్ధ రణకు మానవాకారం దాల్చిన పరతత్వంగా మనం వారిని భావించాలి. కులబేధాలు కుమ్ములాటల భ్రమలని స్త్రీ పురుషులు అనేవి రెండే కులాలనీ బోధిస్తూ ఆకలైనవారికి అన్నం పెట్టడాన్ని మించి మరో ధర్మమే లేదనిరి. అందువల్లనే నేటికిని వారి ఆశ్రమంలో వేలాది మంది భక్తులకు నిరంతర అన్నదానం జరుగుచున్నది. ఇక లింగ రాజుగారి లఘు కావ్యాన్ని పరిశీలింతును. కావ్య ఆరంభంలో రచయిత వెంకయ్యస్వామివారి మహిమలను కొనియాడి కావ్యమును శ్రీకార త్రయముతో ప్రారంభించినారు.

"లలితాకారుడె కాదు సద్గుణ విశాలంబైన" అనే పద్యంలో స్వామివారి నిరాడంబర ప్రకృతి జీవితమును అద్భుతంగా చిత్రించిరి.

"మూకంకరోతి వాచాలమ్" అనే మూక పంచశతిలోని పాదాన్ని ఆదర్శంగా "మూగవానిని వాచాలుగాగ తీర్చ" అనే పద్యంలో స్వామివారి మహిమలను, అమోఘ శక్తులను విశదం చేసిరి.

''శ్వపచుని గోవును, కుక్కను'' అనే పద్యంలో ప్రాణులలో జాతి వివక్ష చూపక ప్రాణులందరిని రక్షించడం స్వామివారి జీవ కారుణ్య సిద్ధాంతానికి చక్కని స్ఫూర్తి నిచ్చిరి. ఇక వారి చరిత్రను వివరించుచూ స్వామివారి నివాసంవల్ల గొలగమూడికి ఏర్పడిన పవిత్రతను, ప్రాశస్త్యాన్ని వ్యక్తం చేసిరి. వచన రచనా పాట వమును పరిశీలించినచో అది తేట తెల్లముగా నోటి మాటకు ప్రతి రూపముగాయున్నది. జటిల దీర్ఘ సమాస బంధములేక లలిత పద గుంభితమై చదువరులకు ఉత్కంఠతను కలిగించుచున్నది. ఆయా శీర్షికలకు చివర రచయితగావించిన వచన రచనా విన్యాసము స్వామి వారి ఆర్తత్రాణ పరాయణతను వ్యక్తము చేయుచున్నదై అక్ష రాస్యులేగాక నిరక్షరాస్యులు కూడా ఆ భావమును అర్థము చేసు కొనే శైలి కల్పించినారు. ఆత్మ జిజ్ఞాసలో గృహ నిష్క్రమణం చేసిన వెంకయ్యస్వామివారి వాన ప్రస్థాశ్రమ ప్రవేశ ప్రారంభములో కవి స్వామి చిత్త ప్రవృత్తిని శబ్ద సౌష్ఠవముతో స్వరూప నిర్మాణం చేసిన విధానమును పరిశీలించిన "శరీరం మాద్యంఖలు ధర్మ సాధనమ్" అనే కాళిదాస సూక్తికి పరిపుష్టిని కలిగించి ఏ ధర్మమును ఆచరించవలయునన్న "ధర్మ సాధనమైన తనువుచేతనే" అను భావాన్ని తమ సీస పద్యంలో పునరావృత్తం చేస్తూ స్వామివారి ధృఢ సంకల్పాన్ని మనకు వ్యక్తం చేసిరి. ఇక స్వామివారు అవధూత కాబోవు సందర్భములో తల్లితండ్రులతో సహా ఇంటిల్లపాది వారిని కసరుచూ రుసరుసలాడు విధానము పరిశీలించినచో ఇది భాగవతంలోని ప్రహ్లాద హిరణ్య కశిపుల సంవాదమును జ్ఞప్తికి తెచ్చుచున్నది స్వామివారి అవధూత స్వరూపమును పాఠకుల చిత్తములో హత్తుకొనునట్లు వర్ణించిరి. ఆ పావనమూర్తి పాద రేణువులలో పునీతులై సమాధినొందిన శిష్యుల భక్త్యావేశమును

వర్ణించుచూ శరణాగతుల యెడ స్వామివారి కరుణాకటాక్షము ఎట్టిదో మనకు విశదము చేసిరి. నిరంతర అగ్నిహోత్ర విస్ఫురితుడైన స్వామి ప్రసన్న పారిజాతములైన తన బోధనలలో ఎందరో శిష్యులను తరింపచేసిన తీరును కవి చక్కగా విశ్లేషించిరి. కులాలు మనలో పుట్టినవి కావని వృత్తులవల్ల ఏర్పడినవనే విషయమును ఈ క్రింది పద్యములో చక్కగా ఉట్టంకించిరి.

గీ॥ భూమిపై మను జన్మము పుట్టినపుడె, మతము, కులమును లేదు
క్రమ క్రమముగ
బ్రతుక నావశ్యకములైన పనులె వారి వారి వృత్తులై
కులములై మారిపోయె

ఒక త్రాగుబోతును క్షమించు ఘట్టములో ఒకప్పుడు అగ్ని గుండమునకు కట్టెలు తెచ్చే బండిని ఆ త్రాగుబోతు ఆపగా స్వామి ఆగ్రహించిన వెంటనే వాడు "రాయివలె నిలచిపోయెనా త్రాగుబోతు" వాడు మన్నించమని కోరగానే తన కరుణా కటాక్ష దృష్టిని ప్రసరింపచేయగా వాడు ఉత్తమ భక్తుడైనాడు. అంటే దుశ్శీలురను కూడా సచ్ఛీలుర చేయుటయే అవధూతల పరమార్థముగా మనము భావించవలెను.

స్వామివారి చాకలి, మంగలి యోగాలను విశ్లేషిస్తూ ఈ క్రింది పద్యములో దైహిక మానసిక శుచులకు ప్రతీకయని వివరించుట ఎంతో సమంజసముగా యున్నది.

గీ॥ యోగములందు చాకలి యోగమన్న, దైహికంబైన శుచియేమొ
ధార్మికునకు
యోగములందు మంగలి యోగమన్న, మానసికమైన శుచియేమొ
మహిత మతికి

పాముకాటుకు చనిపోవనున్న బల్లెను రక్షించమని గ్రామస్థులు కోరిన సందర్భములో కవి కరవు రక్కసిని వర్ణించిన తీరు స్వభావ సిద్ధమైయున్నది. బల్లెను కాపాడిన తీరులో స్వామివారికి ప్రాణి కోటిని ఉద్ధరించుటలో జాతిబేధం లేదనే భావము స్పష్టమగుచున్నది. స్వామి సహాయమునకు ఏతెంచిన ఓ యానాది వనితను వర్ణించే సందర్భములో వారి పేదరికమునకు రూపకల్పన చేసిన తీరు సహజ సుందరమైయున్నది.

గీ॥ చేత తాటాకు బుట్టయు చినుగులున్న, చీరయును
బక్కచిక్క శరీరమును
తనువుదాల్చిన కడు పేదతన మనంగ, వచ్చు
కప్పల యానాది వనిత జూచి

స్వామివారు బ్రహ్మైక్యం చెందిన సందర్భములో గ్రామ భక్తుల చింతాభరాన్ని సహజ సుందరముగా వర్ణించిరి. కావ్య మర్యాదను పాటించుచూ కావ్యాంతము నఫలశృతి వివరించిరి. సర్వ మానవ కళ్యాణము అను శీర్షిక పేర కావ్యమును మంగళాంతముచేసి అవధూత గుణసంకీర్తనంవల్ల కవిరాజు ధన్యజీవులైరి.

ప్రత్యక్షముగా అవధూత చరిత్ర వ్రాయుచున్ననూ పరోక్షముగా ఆస్తిక్యబుద్ధి గరపడం రచయిత సాధించిన ప్రయోజనము. రమ్యాతి రమ్యమైన కావ్యశైలీ విన్యాసముతో స్వామిచరిత్ర వెలార్చిరి. ధర్మబోధ మర్మ గర్భితముగా చేసిరి. వీరి కృతి ఆకృతిగా ఏర్పడుటకు సహకరించిన భక్తులు, శిష్యులు తప్పక అభినందనీయులు అవధూత చరిత్రకు అక్షరరూపమునిచ్చిన వీరి కృషి ప్రశంసనీయము.

"యోగః కర్మసు కౌశలమ్"

"అభినందన చందనము"

—: డా॥ కె. నరసింహారెడ్డి
ఎం. ఏ., పిహెచ్. డి.,
లెక్చరర్
వేదసంస్కృత కళాశాల
నెల్లూరు–524003

తే 29-8-90 ది

"శ్రీ గొలగమూడి వేంకయ్యస్వామి జీవిత సంగ్రహము" అనే హృద్య పద్య, గద్యమయ కృతిని రచించిన 'సుకృతి' శ్రీ కూరపాటి లింగరాజుగారు నెల్లూరులో సాహిత్య బంధువులకు పరిచయమైన వారే ముదిమి వయస్సున కవితావ్యాసంగము నిర్విరామంగా సాగించుచున్న కవి కృషీవలుడు లింగరాజుగారు. భక్తిరస ప్రధానాలైన కావ్యాలను రచించుటలో వీరు సిద్ధహస్తులు. నెల్లూరు పరిసర ప్రాంతములోని భక్తజనులేగాక, సుదూర ప్రాంతాల వారికి సైతము నిరంతరారాధ్య దైవమైన గొలగమూడి వేంకయ్యస్వామి జీవితమును రమ్యముగ, రసబంధురముగా చిత్రించిన ప్రస్తుత కృతి భక్తలోకానికి ఆమోదపాత్రము కాగలదని నా నమ్మకము ఈ కృతి ఆకృతిలో చిన్నది. గుణములచే పెద్దది. ఇందలి గుణములను చూతము.

కథావస్తువు సాంప్రదాయము ననుసరించుట మొదటి గుణము. కవితారచన ప్రాచీన కవితా సాంప్రదాయములను అనుసరించుట రెండవ గుణము. ఇది ద్వితీయముగా పరిగణితమైనను అద్వితీయముగా నిందున్నది. పద్య విద్యకు ఆదరము దినదినమునకు కాదుకదా, క్షణక్షణమునకు తగ్గిపోవుచున్న నేటి రోజుల్లో పద్యమయములైన ఇటువంటి కావ్యములు సాంప్రదాయ కవితాభిమానులకు కొంత ఓదార్పు కలిగించును కూరపాటివారి కవనమార్గము కంటకరహితము. రీతి రమ్యములగు వీరి పద్యములు వాణీ వీణా నినాదములను ప్రతిధ్వనింపజేయు మధురమంజుల కవితావాద్యములు.

శ్రీ పెసల సుబ్బరామయ్య, ఆచార్య అక్కిరాల భరద్వాజ పండితుడు చెప్పిన అవధూత వేంకయ్యస్వామి లీలలను ఆధారముగా చేసికొని లింగరాజుగారు ఈ లఘు కృతిని రచించారు.

మన పూర్వులు కృతిని ఒక్క శ్రీకారముతో ప్రారంభించారు. లింగరాజుగారు "అధికస్య అధికంఫలం" అనుకున్నట్లున్నారు. కృత్యాది పద్యమున మూడు శ్రీకారములనుంచారు.

రెండవ పద్యమునుండి 15వ పద్యమువరకు మొదటి పాదములోని మొదటి అక్షరములను చదివినచో "జయ! వేంకయ స్వామీ! నమో! గొలగమూడీశ" అని వచ్చును. ఇట్లు రచన చేయుట సిద్ధహస్తులకే సాధ్యము అన్యులకసాధ్యము కదా!

వేంకయస్వామి జీవితమును, వివిధ రసవత్తర ఘట్టములతో మేళవించి రచింపబడిన ఈ కావ్యము భక్తవరులకు దివ్యప్రసాదము వంటిది. ఇందు స్వామిరూపము

"సన్నగా పొడవైన చక్కని దేహమ్ము
చూడగా సొబగైన సోగ కనులు
చామనచాయ, విశాలమౌ నొసలును
చక్కని పలు వరుసనుగల్గి
ఆజానుబాహువు లందమౌ ముక్కును
తుమ్మెద రెక్కల ద్రోలు కురులు
మోకాళ్ళపైదాక మొలకుగట్టిన పంచ,
క్రంతలున్నట్టి చొక్కాయితోడ

గట్టిదైనట్టి పంగాలు కర్రబట్టి
రకరకాలైన చిన్న పేలికల గుడ్డ
లింతలు, లింతలు మూటలు నిట్టునట్టు
కదిలియాడుచునుండగ కపిల మోకు
ముక్కలను మోసికొనుచు డుబుక్కు డుబుక్కు
మనుచు గ్రామాల దిరుగు వేంకయ్యస్వామి"

అని వర్ణింపబడినది ఈ రూపవర్ణన పద్యము ప్రబంధకవుల పద్యములను తలపునకు తెచ్చుచున్నది.

"మూగవానిని వాచాలుగాగ దీర్చ
రోగిగ్రస్తు కుములువాని సారోగ్యజేయ
గ్రుడ్డివారికి చూపు బాగుగ నమర్చ
కోరువారికి వలసిన కోర్కెలివ్వ
అవతరించెను నిచట వేంకటస్వామి"

ఈ పద్యము "మూకంకరోతి వాచాలం", "పంగుం లంఘయ తేగిరిం" అనెడి శ్లోక పాదములను సరిపోలుచున్నది.

లింగరాజు పద్యములను నడిపించినతీరు చాలా మధురముగా నున్నది పద్యము సమతల మైదానంలో నిండుగా, నిబ్బరంగా గదిలే నదిలా హందాగా నడుచును.

"గొల్లమూడియొక్క కుగ్రామ మానాడు
నీదు రాకముందు; ఓ దయాబ్ధి
నాడు నిన్ను పిచ్చివాడుగా పెక్కండ్రు
తలచినారు, నేడు కొలచినారు"

ఇత్యాది పద్యముల నిందుకు ఉదాహరణములుగా చూపవచ్చును.

ఈ కావ్యమునందనేక గుణములు కలవు. వానిలో ఉత్తమమైనది పాఠకులను చదివించే గుణము. పుస్తకము ఆద్యంతము చదివించే గుణముతో అలరారుచున్నది. ఇందుకు కూరపాటి లింగరాజుగారు ఎంతైనా అభినందనీయులు. అందుకే వారికి నా అభినందన చందనం అందించుచున్నాను.

—o—o—

సమీక్షణము

అమృతవాక్కుల శేషకుమార్
సంస్కృతోపన్యాసకుడు
వేదసంస్కృత కళాశాల
మూలాపేట, నెల్లూరు-3.

దీన జనరక్షణ, దర్పదళన నిర్వహణలకై సృష్టికర్త "సంభవామి యుగేయుగే" యని అవతరించిన కర్మభూమి పుణ్యభూమియైన భరతభూమిపై ఎందరో సత్పురుషులు, యోగులు, మునులు, మహర్షులు ఉద్భవించి జగన్నాటక సద్గతికి నిర్దిష్ట మార్గదర్శక సూత్రములను అందించియున్నారు. ఇట్టివారిలో అర్వాచీనముగ "యతిధర్మంబుల బాల్యమున యందాసక్తి పెంపార", 'అభయంకరుడై' నరుడే నారాయణుడను పరమార్థము సార్థకముగ పండించిన సద్గురువర వేంకయ స్వామి జీవిత చరిత్రను చంపూకావ్యముగ విరచించి, ప్రచురించిన శ్రీ కె. లింగరాజుగారు ప్రశంసనీయులు. గోపన్న 'నీ దాసుని దాసుడా గుహుడు' అంటూ గుహునికి దాసుని దాసునకుకూడ మోక్షము వచ్చునంచు తెల్పినాడు.

అప్లేవేంకయ్యస్వామి సేవా తత్పరత తన వాగ్రూప పుష్పముల గుది గ్రుచ్చి మోక్ష సాధన సోపానమును తాను అధిరోహించుటయే గాక పాఠక లోకమునకు ఈ మార్గమును సుగమము ఒనర్చిన లింగరాజుగారు కృత కృత్యులయినారు.

సనాతన ధర్మమును చిరు వాక్యములలో సొగసుగ చెప్పిన కవితా సౌందర్యమును గనుడు:—

"ధర్మ సాధనమైన తనువుచేతనె
జన్మరాహిత్య మాత్మ దర్శనము వలయు
ధర్మ సాధనమైన తనువుచేతనే
లోకోపకృతికి నెల్లెడల బర్యటింపవలయు
ధర్మ సాధనమైన తనువుచేతనే
సర్వ ధర్మ సమానతాదరము వలయు
ఇది సనాతన ధర్మ మార్గీయులైన
తత్త్వవేత్తల జీవితా ధర్మము"........

శ్రీ లింగరాజుగారు "అక్షరశిల్పి" యనుటకు తార్కాణముగ "స్వామి రూపము" నిల్చుచున్నది.

"........ మమకార వల్లికలను
త్రెంపుకొనలేక మోహంబు చంపుకొనక
మొదలు తుదలేని కాంక్షల మునుగుచుండ

మోక్షసాధనమును అసాధ్యమని స్వామివారి ఉపదేశమును తెల్పినరీతి ద్రాక్షాపాకమున బడ్డది.

"ఉత్తమ భక్తురాలు వక్కెమ్మ" సందర్భముగ స్వామికిగల కులములను గూర్చిన భావనను వ్యక్తముచేసిన పద్ధతి ముదావహముగ యొన్నది.

ఈ రచనవలన "ధర్మ రక్షకులకసాధ్యంబు గలదె
పోవు ప్రాణముల నిల్పిన పుణ్యమూర్తి"
యని స్వామికిగల భక్తజన రక్షాతత్పరత తేటతెల్లమగుచున్నది.

తలుపూరు తలుపుతట్టి ఆ యూరి ప్రజల తలపుల వలపుల నందుకున్న స్వామి:—

"సకలార్తిహరుడు నిర్ధూత విషయి
భక్తకోటికి ముంగొంగు పసిడియో" ననుట
కవితామై పూతగన్న యధార్థోక్తి.

'అవధూత వెంకయస్వామి' 'పరమ గురునకు' 'పరార్థ పరునకు' స్వపర బేధ దూరునకు ఆత్మధ్యాన సమాధి స్థితునకు నమస్కరించుచు స్వామి జీవిత సంగ్రహ రచనచే పాప ప్రక్షాళన బొందిన శ్రీ లింగరాజుగార్కి ఇంకనూ భక్తి సంయుత కావ్యములను భక్తజన జీవిత గాధలను రచించు శక్తిని, ప్రచురించు స్తోమతను, అయురారోగ్య సౌభాగ్యములను స్వామి కలిగించునుగాక యని ప్రార్థించుచున్నాను.

"వీణాపాణి" 20/103
31–8–90

ఇట్లు
అమృతవాక్కుల శేషకుమార్

SAHITYA VIDYA PRAVEENA
BHASHA PRAVEENA

K. S. Ramanujacharyulu, M. A;

RETD. PRINCIPAL
Veda & Sanskrit College
Mulapet, NELLROE - 3 (A.P.)

Date: 30-8-90

కవిమిత్రులు శ్రీయుత కూరపాటి లింగరాజుగారు రచించిన అవధూత చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామివారి జీవిత చరిత్రను ఆస్తము పఠించి ఆనందించితిని. ఇందలి విషయము ఒక సిద్ధ యోగీంద్రుని మహిమాన్వితమైన చరిత్ర విశేషము. కవిలబ్ధ ప్రతిష్ఠులు. వీరి కవిత సరళము సరసమునై పాఠకుల నలరింప జేయునట్టిది. ఇక ఈ రచన భక్త హృదయామోదమును పొందు టతో సందేహమేల?

సమకాలీనులు కొందరు భాగ్యశీలురు శ్రీ వేంకయ్యస్వామివారి మహిమలను స్వయముగ చూచినారు. వారి ఉపదేశములను స్వయ ముగ విన్నారు. వారిని సేవించి తరించినారు. కాని అట్టి అవ కాశములేని తరువాతి కాలమువారికిని వారి మహిమలను ఉపదేశ ములను శబ్దపటమున చక్కగ చిత్రించి అందించుచున్న శ్రీ లింగరాజ కవితల్లజులు ధన్యజీవి. భక్తులకు వీరి ఈ రచన నిత్యపారాయణ యోగ్యమగుగాక!

"సర్వస్తరతు దుర్గాణి సర్వోభద్రాణి పశ్యతు"

ఇట్లు
K. S. రామానుజాచార్యులు

XVIII

శ్రీ శ్రీ శ్రీ గొలగమూడి వేంకయ్యస్వామి జీవిత సంగ్రహము

అభిప్రాయము

మతము పేరుతో మానవ మారణహోమం అనాడు జరిగింది, ఇప్పుడూ జరుగుతుంది మతోన్మాదుల చేతుల్లో మతం ఒక భయంకర శక్తిగా రూపొందింది. మానవులు మృగతుల్యులుగా మారడానికి మతం ఒక అనుకూల నినాదమైంది. అందుకే Karl Marx

"Religion the sigh of the oppressed creatures-the heart of the heart less world- the spirit less situation. The opium of the people" అని అన్నారు.

ఈ మత్తునుండి మానవులకు జ్ఞానోదయం గలిగించడానికి, వారి నుత్సాహవంతులజేసి సత్పథోన్ముఖుల నొనరించడానికి పరస్పర అవగాహనతో జీవితం అమృతమయం జేసుకొనడానికి ప్రకృతి అప్పుడప్పుడు మానవ సమాజంలో మహాత్ములను జన్మింపజేస్తుంది. వారు మానవుల మనుగడను సుఖప్రదము కరుణాపూరితము, స్వార్థ రహితము చేస్తుంటారు. వారు దైవస్వరూపులు మానవుడు తన దుర్దశలో పరమాత్మను ప్రార్థిస్తాడు.

'To Mercy, Pity, peace and love all
Pray in their distress, where mercy and
Pity dwell there God is dwelling too'
Blake'

మానవుని ప్రార్థన నాలకించి తగిన వేళల్లో మహాత్ములను పరమాత్మ ప్రసాదిస్తాడు. అటువంటి విశిష్ట వ్యక్తులే ఆనాటి బుద్ధుడు మొన్న మొన్నటివరకూ మనతో చరించిన మహాత్మాగాంధీ శ్రీరమణ మహర్షి, రామకృష్ణ పరమహంస వారు పరమత సహనము, కరుణ, దయ, శాంతి నుద్బోధించినారు మానవులంతా ఒకటే అన్న మహత్తర సిద్ధాంతాన్ని ప్రపంచించి మతము మానవ ఐక్యతకేకాని విభజనకు కాదని తమ నడవడికచేత ఆదర్శమూర్తులై నిలచినారు. కన్నీళ్ళు తుడచి కరుణా స్వరూపులైనారు. మానవునిలోని దైవత్వం వానిలోని రాక్షసత్వాన్ని జయిస్తుందని సోదాహరణంగా స్పష్ట పరచినారు. మానవుడు మహనీయుడు కావడానికి వానిలోని త్రికరణ శుద్ధియే కారణము మనోవాక్కాయ కర్మలలో నైక్యత సాధించిన మానవుడు మానవత్వానికి పట్టుకొమ్మ మానవుడు నిరంత దైవ ధ్యానముతో దైవత్వమును గాంచును. అతి మానుష శక్తులను పొంది దీనుల ఆర్తిని పోద్రోలును. అట్టి కోవకు చెందినవారు ఈనాటి సత్యసాయిబాబా నిన్నటివరకు మనమధ్య చరించిన శ్రీశ్రీశ్రీ గొలగమూడి వేంకయ్యస్వామి. స్వామి చరితమును పలువురు భక్తులు రచించినారు. వారిలో శ్రీ వారి చరిత్రను విద్వాన్ శ్రీ కూరపాటి లింగరాజుగారు పద్య కావ్యముగా రచించినారు. ఈ పద్యకావ్యము చిన్నదయ్యును గుణమున గొప్పది. ప్రసన్న మధురముగానీ కవిత్వము సెలయేటి నిర్మలత్వముతో దక్షిణా నిలముల హాయిని గొల్పును. స్వామివారు బ్రహ్మ నిష్ఠాగరిష్ఠులై వర్ణాశ్రమ ధర్మముల త్యజించి ఆత్మావలోకనార్థము పరిభ్రమించి, జ్ఞానియై అవధూతకు సర్వమానవ సమానత్వము, దీన జనోద్ధరణ గావించిన పవిత్రమూర్తులు. వారి దయాశీలతనీ గ్రంథము చక్కగ నావిష్కరించును.

XX

స్వామివారు నిరతమగ్ని పూజ నొనర్చెడివారు. దీని ప్రత్యేకత యేమి?

శ్లో॥ అగ్నే నయసు పథారానమే అస్మాన్
విశ్వానిదేవ వయునాని విద్వాన్.
యుయోధ్యస్మ జ్జుహు రాణమేనో
భూయిష్ఠాంతే నమ ఉక్తిం విధేమ.

ఈశావాస్యోపనిషత్తు 18 శ్లో.

ఓ అగ్నీ! మాకర్మ ఫలితాన్ని అనుభవించుటకు మమ్ములను మంచి మార్గమున తీసుకొని పొమ్ము. మా కర్మలన్నీ నీకు విదితమే. మా పాపముల నిర్మూలించు. నీకు మరల మరల నమస్కరించుచున్నాము.

'అగ్రం నయతీతి అగ్నిః' అగ్ని అనగా ముందుకు నడిపించువాడని. అందువలననే స్వామివారు నిరంతరము అగ్నిపూజ సలిపెడువారేమో. అదియుగాక వేదములో హోమ మొనర్చునపుడు ఒక మంత్రము గలదు. "అగ్నే ఇదంనమమ" ఓ అగ్నీ నన్ను నీ కర్పించుకుంటున్నాను. నాదేమియు లేదు. కనుక స్వామివారి అగ్నిపూజ కిదియే అర్థమని తలచెదను.

స్వామివారు విద్యాధికులు కారు కాని బ్రహ్మజ్ఞాని. జ్ఞానము సముపార్జించుటకు విద్యార్హతలనవసరమన్నారు.

శ్లో॥ నాయమాత్మా ప్రవచనేన లభ్యో
నమే ధ/ధయా/న/బహు నాశ్రుతేన
యమే వైష వృణుతే తేనలభ్యస్త స్యైష
ఆత్మా వివృణుతే తనూంస్వామ్
కఠోపనిషత్తు–2-23.

వేదాధ్యయనం చేత/గాని బుద్ధి కుశలత చేత/గాని అపార మైన పాండిత్యంచేగాని ఆత్మ పొందబడదు, అది యెవకిని వర్తి స్తుందో వారిచే పొందబడుతుంది. వారికే తన రూపాన్ని ఆవిష్కరిస్తుంది.

సత్పథ చరిష్ణులు, ఇంద్రియ నిగ్రహం కలవారు, ధ్యాన వంతులు ఆత్మజ్ఞానులందురు. ఈ ఉపనిషత్ సూక్తికి శ్రీ వేంకయ్య స్వామి జీవితం చక్కని మూదల.

కవిగారు కావ్య ప్రారంభములో స్వామిగారిని ప్రవేశపెడుతూ వ్రాసిన పద్యములు; స్వామివారు మరణము తర్వాత రచించిన పద్యములు వారికిగల వేదాంత దృక్పథము నెఱింగించును. భక్తి ప్రపత్తులతో, చక్కని శైలిలో నీ పద్య కావ్యమును రచించిన కవి గారిని నేనభినందిస్తున్నాను. ఈ పొత్తము సర్వజనాదరామోదముల పొంది జనాభ్యుదయమును ప్రసాధించునని ఆకాంక్షిస్తున్నాను.

దుగ్గిశెట్టి వేంకటరమణయ్య
3–9–90

సకృతజ్ఞతా వందన అభినందన ఆశీస్సుమములు

నేను శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామి పాద పుష్పముగా సమర్పించిన వారి "జీవిత సంగ్రహము" నకు

కవితా కన్యక గుణములు
కవికన్న రసజ్ఞుడెఱుగు కవియేమెఱుగున్
భువిలో కన్యక గుణములు
ధవుడెఱుగుంగాని కన్న తండ్రేమెఱుగున్!!

అనిన ఒక రసజ్ఞకవి చంద్రుని సూక్తులట్లు చక్కని యభిప్రాయములనిచ్చిన కవి పండిత మండనులకు సకృతాభివందనములు.

తక్కువ వ్యవధిలో ఈ గ్రంథ ముద్రణమందు ముద్రారాక్షసులను అదుపులో పెట్టించి చక్కని అచ్చు గూర్చి యిచ్చిన "నవతా ముద్రణాలయ" సోదరద్వయము చిరంజీవులు శ్రీ కె. చెంగల్ రాజు, (బి. కాం.,) నాగరాజులకు ఆశీర్వాద పూర్వక కృతజ్ఞతలు.

కూర్పునందు చక్కని మెళకువ జూపిన కూర్పరులకు శుభాశీస్సులు అంతజేయుచున్నాను.

ఓం నారాయణ; ఆదినారాయణ.


ఇట్లు
సుజన విధేయుడు
కూరపాటి లింగరాజు

ప్రజోత్పత్తి
చైత్రశుద్ధ విదియ
18—3—91.

ఓం నారాయణ ఓం ఆదినారాయణ

శ్రీ శ్రీ శ్రీ భగవాన్ వెంకయ్యస్వాముల వారి జీవిత సంగ్రహము

దిక్కాలాద్యనవచ్ఛిన్నానంత చిన్మాత్రమూర్తయే
స్వానుభూత్యేకమానాయ నమశ్శాంతాయ తేజసే॥



అంకితం

వెంకయ్యస్వామి శ్రీపద
పంకజముల కంకితముగ భవతారక క
ర్మాంకముగ నర్పణము మో
హాంకురముల జన్మమాయమై పోవుటకై।

ఓం తత్ సత్

-: రచయిత :-

విద్వాన్ కూరపాటి లింగరాజు

ఓం నారాయణ ఆదినారాయణ

తొలివిన్నపము

ఆత్మస్వరూపులైన సోదర, సోదరీ మతల్లులారా విన్నపము.

లౌకిక బహుళార్థకల్పకము, ఆర్తార్తిహరుడు, ఆధాత్మిక పర మార్థ జ్ఞానసంధాత, గొల్లముడి స్వాములుగా నానాజన పదంబుల ప్రఖ్యాతి వహించిన శ్రీశ్రీశ్రీ వెంకయ్య స్వాములవారికి మాతృదేవి పిచ్చమ్మగారు, పితృదేవుడు పూర్వార్జిత పుణ్యగరిష్ఠుడు పెంచలయ్య నాయుడుగారు. ఇంటిపేరు "సోంపల్లి", జన్మగ్రామము రాపూరు తాలూకా నాగులవెల్లటూరు, వంశమున కమ్మవారు.

కుటుంబము- సామాన్య కర్షక కుటుంబము, చదువు- కొన్ని నాళ్ళుమాత్రం సిద్దిరాజు రామయ్య సు ృతియింటరాత్రివేళల. అత్రికాల వేదికి ఐదేండ్ల వయసు నుండే యేకాంతవాసకాంక్ష. దాదాపు పద్దెనిమి దేండ్ల ప్రాయముదాక పట్టీపట్టనట్టుగా సంసార జీవితం. ఆతర్వాత అవధూతగా, అటుపిమ్మట మౌనిగా అనంతరం వానప్రస్థము. లక్ష్య సిద్ధితో తదనంతరం పారమార్థికజీవనం. అర్థార్థులపాలిట సర్వప్రదా తగా, స్వాములవారుగా, గొల్లముడి గ్రామ పుణ్యాలపంటగా, అనేక గ్రామములలో చిత్రాతిచిత్ర మహిమాన్వితుడుగా, ఆర్తోజిజ్ఞాసు, రర్థార్థి జ్ఞానీ; (1) బహువిధములైన ఆర్తులజిక్కిన వారికీ, (2) పరమార్థ మెఱుగగోరు వారికీ, (3) భాగ్యభోగ కాంక్షులకూ, (4) ఆత్మజ్ఞానార్జన మునకు ఆరాటపడు అంతేవాసులకూ. సర్వవరదుడుగా కుల మత భేదము పాటింపక దరిజేరు నెల్లరకు నాదరువుగా, తాను విడిదిచేసిన చోటు ఒక తీర్థముగా క్షేత్రముగా వెలయింపజేయు దైవముగా సేవా ర్చనల విరాజిల్లినారు.

1982 సం॥ ఆగష్టు తే 24 దిన తన భౌతిక దివ్యదేహ మును విడిచి, గొల్లముడి యందలి పావన పూర్ణాశ్రమ సన్నిధిని సమాధిస్థము చేయించుకొని తదాది—

అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం॥

మాకు ఇతరంగా దిక్కులేదను దృఢనిర్ణయంతో "ఓదేవా నీవే మాదిక్కని" నన్నేధ్యానించుచు, చింతించుచు ఎవరుందురో అట్టి వారిని, వారి కుటుంబమును పూర్తిగా నేనే కాపాడుదును అను గీతాచార్యుని అభయ వాక్యముల ప్రకారమూ, ఇతరంబెఱుగనయ్యా నాగతి నీవే రామయ్యా! అను అనన్యభావముతో తనసర్వస్వము భద్రాది రామునకు సమర్పించి దాసానుదాసుడైన కంచెర్ల గోపన్న ప్రకారమూ ఎవరు గొల్లముడి స్వాములవారిని అనన్య గతికులుగా నమ్మిదాన్యింతురో, సేవింతురో వారికి స్వప్నదర్శన ప్రసాదములుయిస్తూ "ఇంతింతై వటుడింతయై మఱియు నంతై" నభంబాక్రమించిన త్రివిక్రము చందంబున గొల్లముడిగ్రామమును ఒకపావన ప్రసిద్ధక్షేత్రరాజంగా వెలయు- "దైవం మానుషరూపేణ" అను సూక్తికి నిదర్శనంగా విలసిల్లు ఆమహనీయు సుచరితను

"విబుధవరులచేత విన్నంత కన్నంత
తెలిసినంత వఱకు తేట పఱతు"

అని వినమ్రతతో పల్కిన భక్తశిఖామణి సహజకవిచంద్రుడు పోతనామాత్యువలె, 'విన్నది విన్నట్టు కన్నది (చూచినది) కన్నట్టు' మహా

భారత యుద్ధాన్ని కన్నది కన్నట్టు, విన్నది విన్నట్టు ధృతరాష్ట్ర మహారాజుకు సంజయ మహాశయుడు వివరించినట్టు వివరింపజాలను. తెలిసినంతలో యథాశక్తిగా రచించి చరితార్థుగా దలంతును.

నా యీ రచనకు ప్రధానమాతృక స్వాములవారికి అత్యంత భక్తుడు సుమనస్కుడు శ్రీ పెసల సుబ్బరామయ్య సేకరణలకు విపులీ కరణంగా పండిత కవివతంసుడు శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు విరచించిన "అవధూతలీల" యందలి కొన్ని ఘట్టములలో అక్కడక్కడ కొన్నిటినీ, కర్ణాకర్ణిగా నేను విన్నవానిలో గొన్నిటినీ పద్య గద్య సుమములుగా ఏర్చికూర్చి స్వాములవారి శ్రీ పాదరాజీవములకు సమర్పింతు.

మఱియొక ముఖ్య విజ్ఞప్తి

"ప్రపేదిరే ప్రాక్తన జన్మవిద్యాః" పూర్వ జన్మల పరమార్థ విద్యలు వెంకయ్యస్వాముల వారికి ఈజన్మలో ప్రాప్తించి వెల్లివిరిసినటున్నవి.

అటుగాదేని పుట్టినదా! అవిద్యావంతుల కుటుంబమున, పరిసరములూ, గ్రామమూ అధ్యాత్మ విద్యకు అనువూగావు, సహకారులూ గావు గదా!

"వదంతు శాస్త్రాణియజంతుదేవాన్, కుర్వంతు కర్మాణి భజంతుదేవతాః
ఆత్మైక్యబోధేన వినావిముక్తిః నసిధ్యతే బ్రహ్మశతాంతరేపి॥

శాస్త్రములు నేర్చినను, దైవయజ్ఞములు సల్పినను, పుణ్యకర్మలాచరించినను, ఆత్మసాక్షాత్కారము వినా నూరు బ్రహ్మ సంవ

త్పరములకైనా మోక్షప్రాప్తి లేదు" అను జగద్గురు శంకరులవారి అభిభాషణములను, "సఏవఖలు మూఢాత్మా యస్తుస్వార్థే ప్రమాద్యతి" ఆత్మసాక్షాత్కార విచారము చేయక ఎపడుపేక్షించునో లేదా ఏమరుపాటుతో నుండునో వాడే మూర్ఖుడు" అను ఆపూజ్య శంకరులవారి తాత్విక సిద్ధాంతములను మన శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వాములవారు ప్రాక్తనజన్మ విద్యలుగా వారియీజన్మయందు పుణికి పుచ్చుకొని ఆచరించి ధన్యులై మనలనూ గృతార్థులజేసి, గొల్లముడి పూర్ణాశ్రమస్థ సమాధిలో నిత్యసత్యులుగా విలసిల్లుచున్నారు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

అరవిందనగర్
నెల్లూరు - 3
ప్రమోద శ్రావణ
బహుళ, సోమవారం
20 ఆగష్టు 1990

ఇట్లు
మహనీయుల సేవకుడు
విద్వాన్ కూరపాటి లింగరాజు

1. శ్రీ శ్రీ శ్రీ వేంకయ దే
వా! శ్రిత మందార! ఆర్త పరిపాలక! బ్ర
హ్మ శ్రీ శా! నీపద ప
ద్మశ్రీ సేవా ప్రసన్న దర్శనమీవే॥

2. జయ కారుణ నిధాన! ఆర్తజన రక్షాదక్ష! యోగింద్ర! వేం
కయ స్వామి! నిరతాగ్ని హోత్రవిధి దీక్షాప్రాప్త మహాత్మ్యా! చి
న్మయ రూపా! పరిధూతపాప! సకలాంతిర్వర్తి తేజస్వి! భ
వ్య యశోమండన! పాహి! పాహి! అవధూతా! గొల్లమూడీశ్వరా!

3. యతిధర్మంబులమీద బాల్యమునయందాసక్తి పెంపార సం
సృతి వారాసిని దాటి హోవశము కానేకాదు పొమ్మంచు నం
చిత కర్మానుగ పుణ్యపాక ముపదేశింపంగ సంసార వి
స్మృతి నీలోనన బాదుచేసుకొనెస్వామి! దివ్య శక్త్యాత్మకా!

4. వేంకయ సామీ! సంసృతి
ఏంకంబున జిక్కుకొను నభాగ్యుల నీసే
వాంకితుల జేయవే! అభ
యంకర శ్రీ గొల్లమూడి యావాస! ప్రభూ!

5. కమలాకాంతు సువర్ణ మాలికను ముఖ్యమ్మైన "నారాయణా"!
ఖ్య మహామంత్ర జపంబహర్నిశలు సోంకారంబుగా జీవితాం
తము ధ్యానమ్మొనరించి చేరితి పరంధామమ్ము, త్వద్భాగ్యమే
మి! మహాత్మా! నిరతాగ్ని హోత్రపరతా మేయ ప్రభావాకరా!

6. యమ నియమాదు లెరుంగము
శమ దమ సంపత్తి లేదు స్వామీ! నీపా
దము లన్నిట గను సౌభా
గ్యము నిము, దయానిధీ! మహామహి మాఢ్యా!

7. స్వామీ! వేంకయ సద్గురు!
ఎ మహిమలనంతములు పునీతము, లార్త
క్షేమంకరములు లక్ష్మీ
ధామంబులు గొల్లముడి సదా వర్ధిలగన్

8. మీ నిత్య నూత్న మహిమల
కాణాచిగ గొల్లమూడి గ్రామము నీభ
క్తా నీకము భజియింతురు
మానితముగ నిన్ను భజన మందిరములలో!!

9. నరుడే నారాయణుడను
పరమార్థము సార్థకముగ పండించిన స
ద్గురు వరవేంకయ మీవర
చరితము రచియింపగా ప్రసన్నుడ వగుమా!

10. మోక్షము నందగ సర్వులు
కాంక్షింతురుగాని విమల కర్మల కొఱకై
దీక్ష వహింపరు! దృఢతర
దీక్షలె, తన్మోక్ష మార్గ దీపికలు సదా!

11. గొలగముడియందు వెలసిన గురువరుండు
వేంకయస్వామి! కోర్కెలు వెల్లి విరియు
పుట్టయైనట్టి సంసారమును త్యజించి
త్యాగమయ, దుస్సహిష్ణు, విరాగసాధ్య
మోక్షధామమ్ము నేతగా పూజ్యుడయ్యె!

12. లలితాకారుడెకాదు, సద్గుణ విశాలంబైన చిత్తంబు ని
స్తుల వైరాగ్యము తోడుగా అడవులందున్ కోనలున్ కొండలున్
బలమౌ వాగులు, వంక గట్టులును నావాసంబుగానుండి ఆ
కలికై వేంకయయోగి తీసికొనెగా కాలాకులున్ గడ్డలున్!!

13. గమనా గమనముగల యు
త్తమ జాతి మనుష్యజాతి తన యిప్పటి జ
న్మమునందే జనన మరణ
క్రమములు దప్పించు గురులకడ జేరరుగా॥

14. మూగవానిని పాటాలుగాగ దీర్ప
రోగియై కుములు వాని సారోగ్యు జేయ
గ్రుడ్డివారికి చూపు బాగుగ నమర్ప
కోరువారికి వలసిన కోర్కెలివ్వ
అవతరించెనుమ నిపట వెంకయ్యస్వామి!

15. డీలుపడు భక్తతతి కభయాలొసంగ
విమత మానవ దుష్ట ప్రవృత్తి మాన్ప
భాగ్యా బల గర్వితుల అహంభావ ముడుప
అవతరించిన మూర్తి జోహార్, జోహారు॥

16. శ్వపచుని గోవును కుక్కను
నృప చంద్రుని, సేవకుని పునీతుని నధమున్
కపటిని విశాల చిత్తుని
వేప మెన్నక రక్ష సేయు నేతవు స్వామీ!

17. కం॥ రాముని దివ్యకథా మృత
మే మఱపున బడెడు స్వామి! మీచరిత సుధా
ధామమున గుప్త పఱచిన
మీ మిత వచనామృతా ప్రమేయ రుచులతో

18. మ॥ యతిగా లౌకిక సర్వకార్యముల యందాసక్తి బోనాడి యా
గతమౌ పుట్టినయిల్లు వాకిళులు స్వగ్రామంబుతో వీడియా
ర్జిత పూర్వార్జిత పుణ్య కర్మములు ప్రేరేపంగ నేకాకిగా
వ్రతిగా మోక్ష పథానుగామివయి దుర్గంబుల్ ప్రవేశించితే

చరిత్ర ప్రారంభము

19. గీ॥ గొలగముడి యెంత పుణ్యంబు కూడబెట్టి
యుండి అవధూత వెంకయ్య యున్న పరమ
పావన క్షేత్ర రాజమై వాసికెక్కె
దినదినంబును నాలుగు దిక్కులందు.

20. ఆ.వె॥ గొల్లమూడియొక్క కుగ్రామ మానాడు
నీవు రాకముందు; ఓ దయాబ్ధి
నాడు నిన్ను పిచ్చివాడుగా పెక్కండ్రు
తలచినారు నేడు కొలచినారు!!

21. గీ॥ గొలగముడి పేరు ధ్యానింప సప్త మహిమ
లున్న వెంకయ్యస్వామి ప్రసన్నమూర్తి
భావ భవనాన దర్శన భాగ్యమిచ్చి
అభయ హస్తముతోడ సమాదరించు!!

22. కం॥ శ్రీ నాగుల వెలటూరా
నీ నిజ జన్మస్థలం బనిర్వచనీయ
శ్రీ నిర్వృతి ధామము చతు
రాననువకునైన నలవి యానునుతింపన్!

వచనము : నెల్లూరుజిల్లా సుల్లలితకీర్తి కాంతను మహా సంపదలతో అదృష్టవంతుల ఎందరినో, కోటీశ్వరుల నొనరించిన, దురదృష్టవంతుల నెందరనో బికారులజేసిన కాకిబంగారపు గనులతో పశ్చిమ దేశాలతో వాహ్యాళి చేయించిన రాపూరు తాలూకాకు చెందిన నాగలేటూరు గ్రామములో కమ్మవారు బహు కుటుంబీకులున్నారు. అట్టివారిలో ధైర్య త్యాగాది గుణాలతో నెల్లూరువరకు కీర్తిలతలను అల్లింపజేసిన పద్మనాయుడు లౌకికాండంబరపరుడుగా పేరుగాంచె. ఇక మన ప్రస్తుతకథా సన్మూర్తి శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామి వారి సద్వంశము పొంపల్లి అందు—

23. సీ॥ పరమ పావనము సోంపల్లి వంశమ్ము త
ద్వంశ సుధాబ్ధి పార్వణ శశాంకు
డౌ అవధూత బాల్యాది సంసార సా
గర దూరుఁడౌ విరాగ ప్రవృత్తి
వెన్నతో బెట్టిన విద్యగ వెంకయ్య
తనయూర ప్రక్కయూళ్ళను మెలంగు
ఆధన్యు సోదరుడైన చిన్నప్పనా
యడు చెల్లెలైన మంగమ్మ వారి

తల్లిదండ్రుల కానంద ధామములుగ
పెరుగుచుండిరి బాల్యాన, పరమ గురుడు
నాగ వెలుగొండ నున్నట్టి యోగి వెంక
యావధూతగ వెలయు చిత్రాతి చిత్ర
రీతి లోకుల యూహా కతీతు డగుచు!

24. కం॥ గృహ విషయములకు జెందిన
తహ తహ నానాట క్షీణదశనందగ నా
మహితాత్ము డాత్మ చింతా
వహ చిత్తుడు మనసులోన భావించె నిటుల్

8

ఆత్మ జిజ్ఞాస గృహ నిష్క్రమణం

25. కం॥ తన యీ మానవదేహము
కనగా దుర్లభము దాని గడచిన జన్మం
బున జేసిన పుణ్యంబున గనియును
కనుగొనము ఆత్మగను మార్గంబున్!

26. సీ॥ ధర్మ సాధనమైన తనువు చేతనె జన్మ
రాహిత్య మాత్మ దర్శనము వలయు
దర్మ సాధనమైన తనువుచే లోకోప
కృతికి నెల్లెడ బర్యటింపవలయు
ధర్మసాధనమైన తనువు చేతనె సర్వ
ధర్మ సమానతాదరము వలయు

ఇది సనాతన ధర్మ మార్గీయులైన
తత్త్వ వేత్తల జీవితాదర్శముగ వి
వేచనము జేసికొనుచును వేంకయార్యు
డరుగ సమకట్టె మూడవ యాశ్రమంబు!!

వచనము : ఇట్లు ఆశ్రమంబులలో మూడవదైన వాన ప్రస్థాశ్రమమునకు బోవ కృత నిశ్చయుండై దాని కను గుణమైన నడవడికతో నున్న కుమార వెంకయ్యను జూచి ఇంటివారందరు!

27. గీ॥ బాలునివలె నున్మత్తుని
లీలను వెంకయ కుమార లీలలు జూడన్
గాలికి దిరిగెడు బుడుతల
వాలాయము దోప నింటివారలుకమెయిన్!

28. గీ॥ రుసరుస లాడెడు నన్నయు
కసరుచు దన నడక తప్పుగా జెప్పుచు వె
క్కసపడు పితరులతో సం
తసమున వెంకయ్యవారి దార్కొని పలికెన్!

29. కం॥ మీ మార్గంబున మీరును
నా మార్గంబునను నేను నడచుట తగవే
మీ మన్ననకు కృతజ్ఞుడ
నా మనసెటు దారి చూపినా అటు బోదున్॥

30. కం॥ దయతో సమ్మతి యిండని
పయనంబగుచుండ వారు బావురుమని వేం
కయ! మమ్ము వీడి చనుదే
దయలేదా తుదకు తల్లిదండ్రుల యెడలన్!

వ. అట్లు గొంతుకలు తడబడ నేడ్చుచు నడుగు తలి దండ్రులతో ఆవిరాగి ఇట్లని విన్నవించె.

31\. ఆ.వె. తీవ్ర తపముతోడ దీర్చెద పితరుల
ఋణము సత్యమిద్ది ఋణము పడను
ఆత్మ దర్శనమ్ము నందిన పిమ్మట
భక్త తతికి కొంత ప్రాపు నగుదు!

32\. గీ॥ అనుచు గృహ బంధమును త్రెంచె త్యాగధనుడు
వెంకయ మనస్వి; ధైర్య వివేకములను
ఆప్త మిత్రులు తోడుగా నడవులకును
అత్మ దర్శన దీక్ష నేకాంతమందు!!

వ॥ వానప్రస్థాశ్రమమున చరితార్థుడై పల్లెలకు వేంచేసిన స్వామివారి దర్శనమునకు తండోప తండములుగ రాత్రిం బవళ్ళు వచ్చు అర్థారులు అస్వామి దర్శనము జేసికొనిరి.

❋
❋❋

11

స్వామి రూపము

33. సీ॥ సన్నగా పొడవైన చక్కని దేహమ్ము
చూడగా సొబగైన సోగ కనులు
చామనఛాయ, విశాలమౌ నొసలును
చక్కని పలు వరుసయును గల్గి
ఆజాను బాహువు లందమౌ ముక్కును
తుమ్మెద రెక్కల ద్రోలు కురులు
మోకాళ్ళపైదాక మొలకు గట్టిన పంచ
క్రంతలున్నట్టి చొక్కాయితోడ

గట్టిదైనట్టి పంగాలు కర్రబట్టి
రకరకాలైన చిన్న పేలికల గుడ్డ
లిం లింతలు మూటలు నిట్టునట్టు
కదలియాడుచునుండగ కపిలమోకు
ముక్కలను మోసికొనుచు డుబుక్కు డుబుకు
మనుచు గ్రామాల దిరుగు వేంకయ్యస్వామి
ఆర్తి నర్థించువారికి నగ్నిపూజ
సలపి చీట్లు వ్రాసిచ్చు ముద్రలను వేసి

: గొల్లముడికి వేంచేయుట :

34\. కం॥ వెంకయ్యస్వామి పదయుగ
పంకజముల గొల్చు భవ్య భాగ్యము గల్గెన్
ఏ కొలది భక్త పరులకా
ప్రాకటముగ గొల్లమూడి పల్లెల యందున్!!

: తులశవ్వ :

35\. గీ॥ వారి యందున తులశవ్వ ప్రథమురాలు
అన్నదానాది పుణ్య కార్యాలు, దాన
ధర్మ సద్వ్రత కల్పముల్, దైవపూజ
లెన్న దగినటు చేసిన సన్నుతాత్మ!!

వ. ఆ పరమ పుణ్యురాలు స్వామివారి చిత్రాతి చిత్ర చరిత్రంబులు వారి వలన వీరి వలన ఆకర్ణించియున్నది కావున ఆపావనమూర్తి దర్శనము కాగానే వారి పాద పంకజముల పైబడి ఇట్లు సన్నుతించె.

36\. కం॥ కొందరు "సన్యాసిగ" ని
న్నందురు మరి కొందరేమొ అవధూతగ బే
ర్కొందురు యిక కొందరు ని
న్నందురు "హఠయోగి" యనుచు నయ్యె యెడలన్!

37\. కం॥ మీవంశ పునీత చరి
త్రావిర్భావంబు తెలియనౌన మహాత్మా!
ఓ విశ్వావన! చెవులం
ద్రావగ త్వచ్చరిత సుధ సదా వరమీవే!!

38\. కం॥ నిను గన్న తలిదండ్రులు
ఘన పుణ్య నిధానములు నఖండ యశోభా
జనులయి ఆచంద్రార్కము
మనగలరు యశశ్శరీర మండనులగుచున్.
ఓ ఆర్తజన రక్షా పరా! ....

39\. కం॥ శనగలు, బెల్లము, కొబ్బెర
పసుపుగ పాకంబు చేసి స్వామీ! ఓ వేం
కన నీకు సమర్పింపగ
కనుచుంటిని నీదు రాకకై యీ చోటన్!!

వ॥ అని పరమభక్తితో సమర్పించిన అమధుర పదార్థమును శబరిచే రామునట్లు ప్రసాద పూర్ణ వదనుండై స్వీకరించిన ఆయమ పరమానందము జెంది స్వామి సేవల కంకితయయ్యె!

శ్రీ బుజ్జయ్య శరణాగతి.

40. గీ॥ గొల్లమూడి గ్రామమందున కొట్టికూటి
వంశజుండైన బుజ్జయ్య వాసిగన్న
స్వామి భక్తులలోన నాశ్రమము వృద్ధి
చేయు వారల నుత్తమశ్రేణి వ్యక్తి!!

41. గీ॥ భౌతికంబుగ గల్గిన వ్యాధి మొదలు
తీసి వేసియు నజ్ఞాన తిమిరమునకు
జ్ఞాన దీపంబు దయసేయు స్వామి పాద
నీరజములను బుజ్జయ్య నిర్మలాంత
రంగమున గొల్చుచుండు నిరంతరంబు!

వ॥ నిరంతరము స్వామిసేవాయత్తంబైన చిత్తంబుతో నున్న బుజ్జయ్యకు పెండ్లియీడు వచ్చినదని తన తండ్రి పూర్వాశ్రమ ప్రభుడైన వెంకయ్యస్వామి వారిని సందర్శించుకొని సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి లేచి చేతులు గట్టుకొని స్వామీ!

42. గీ॥ నా సుతుండైన బుజ్జయ్యతో సమాన
వయసు వారెల్ల నొకయింటి వారలైరి
స్వామి! బుజ్జయ్య పెండ్లిగావలయు; సెలవు
సాదరంబుగ నీవె మహానుభావ!

43. గీ॥ జనకు మాటలాలించి-బుజ్జయ్య మొగము
వంచి గురుదేవు సెలవుకై వేచియుండ
కరుణ దొణికిసలాడు త్రికాలవేది
పలికె నందఱు నాశ్చర్యపడు విధాన!!

44. సీ॥ పూర్ణాశ్రమంబును పోషింప రక్షింప
బుజ్జయ్య ముఖ్యాతి ముఖ్యుడగును
పూర్ణాశ్రమ ప్రభు బూజింప సేవింప
బుజ్జయ్య ముఖ్యాతి ముఖ్యుడగును
భవ్య పూర్ణాశ్రమ ప్రాసాద నిర్మాణ
ములకు బుజ్జయ్యయే ముఖ్యుడగును
భవ్య పూర్ణాశ్రమ భావి సౌభాగ్య ని
ర్మాతల బుజ్జయ్య ముఖ్యుడగును

ఉజ్జ్వలంబైన భవితవ్యమున్న కొడుకు
కుఱ్ఱ బుజ్జయ్యనే పెండ్లికొడుకు సేయ
అనుమతించిననెట్లు పూర్ణాశ్రమంబు
భావి బహుళాభివృద్ధి చేపట్టగలము!

45. కం॥ ఘన గంభీరము కంఠ
స్వనమున వెంకయ్యస్వామి, వాణి వినిన ఆ
జనమును; బుజ్జయ జనకుడు
పని వినెదము; స్వామి సెలవు వచ్చినయట్లే!

వ॥ ఇవ్విధంబున బుజ్జయ్య తండ్రియు, అచటనున్న భక్త జన సందోహంబును భక్తి ప్రపత్తులతో విన్నవింప స్వామి మందహాసభాసమాన సుందర వదనంబున నంగీకారంబు దెల్పి బుజ్జయ్యను పూర్ణాశ్రమస్థుగా నియమించె. ఆప్రకారము స్వామిచే నియుక్తుడై ఆశ్రమమును అన్ని విధముల అభివృద్ధిచేయుటకు, స్వామిసేవలకు అంకితుడై ఆప్రభుని కింకరుడుగా మెలగు బుజ్జయ్య యొకనాడు స్వామిపాద రాజీవ సన్నిధి మోకరిల్లి :—

46. కం॥ ఎవరయ్యా! సంసారా
ర్ణవ పారము జేర్పజాలు నావిక గురుదే
వ వరేణ్యుడు నీకన్నను
అవధూతా! శరణు! వేంకయస్వామి గురూ!!

47. సీ॥ నిరతాగ్ని హోత్ర విస్ఫురితంబు నీదు స
చ్చారిత్ర వేంకయస్వామి విశద!
దరిజేరు వారికా దరువుగా నిల్చు నీ
చరితంబు వేంకయస్వామి వరద!
అన్న వస్త్రము లెట్టివైనను గైకొను
సమవర్తి వెంకయస్వామి విబుధ!
కులమత లక్ష్యముల్ తలపోయ నొకటని
చాటి బోధింతు వోస్వామి పూజ్య

గొలగమూడి గ్రామమున కొక్క వెలుగు జూప
వచ్చి నాడవ! వెంకయ్యస్వామి! వేడు
ప్రోవ విచ్చేయు మా! దేవ! పుణ్యమూర్తి
మాదు గ్రామాల భవ్య సంపదలు పొదల!!

48. కం॥ యతివర వెంకయస్వామీ
మతి లౌకిక కాంక్షలందు మరపెడి అత్యా
యత సంసారంబున బడి
సతమతమౌ మాకు నీదు సన్నిధి నీవే!!

బరిగల నాగయ్య

53. సీ॥ స్వామి భక్తిపరుండు బరిగల నాగయ్య
తన శరీరారోగ్య మనువు దప్పి
వ్యాధి వచ్చినవాడు బహు వెట్టివాడను
సామెత తన యెడ సార్థకముగ
ఎవరు చెప్పిన వైద్యమెల్లను కష్ట న
ష్టాలతో జేసియు జబ్బు నయము
కనబడకుండుటేగాక నానాటను
పెరిగి పోవుచునుండ భీతి జెంది

గొలగముడి వెంకయస్వామి గొప్ప మహిమ
లున్న సందర్భములు చాల కన్నవారు
విన్నవారును దెల్పగా విశ్వసించి
పయనమయ్యెను నాగయ్యస్వామి దర్శ
నమున నవ్వాని నిర్మల నమ్మిగోరి!!

54. గీ॥ గొలగముడి యాశ్రమముజేరి గురుని పాద
పంకజములకు సాష్టాంగ వందనములు
ఎన్ని యేనియు గావించి విన్నవించు
కొనియె తనయున్నదశను సద్గురునితోడ!!

55. గీ॥ ఆర్తుడై చేరినట్టి నాగయ్య బాధ
పరమ కరుణార్ద్ర చిత్తుడౌ స్వామి చూచి
అమృతమయ పూర్ణ దృష్టి మహౌషధముగ
నివ్వ నాగయ్య బాధ శమించిపోయె!;

56. గీ॥ నాడు మొదలుగ నాగయ్య వీడకుండె
స్వామి సన్నిధి నాశ్రమా వాసుడగుచు
దేహ మానస బాధలు దీర్చు నా మ
హాత్మ సన్నిధికన్న భాగ్యంబు గలదె!

భక్త గురవయ్య

57. కం॥ గురవయ్య మంచి భక్తుడు
గురు పాదాబ్జములచెంత గూర్చొని స్వామీ!
సరిహద్దులేని సంసృతి!
తరణోపాయంబు జూపదగనే దయతో!!

58. కం॥ పరమోదార చరిత్రా!
దురితభర లతాలవిత్ర! ధుని యజ్ఞేశా!
పరమానంద మయాత్మా!
శరణాగత రక్ష! జయము జయము మహాత్మా!!

వ॥ ఈప్రకారము గురవయ్య పరమార్థ మర్థింప మనస్వామి దరహాసభాస మాన వదనమున ప్రసన్నుడై ఇట్లు బోధించె.

59. సీ॥ ధర్మ సాధనకు ప్రధాన సాధనమగు
తనువు బ్రసాదించె ధాత మనకు
ధర్మార్థ కామముల్ ధన్యమౌ మోక్షంబు
నను చతుర్విధ పురుషార్థములను
సాధింపవలసిన జన్మలో తొలి మూడు
పురుషార్థముల యందె మునిగిపోయి
ముఖ్యాతి ముఖ్యమౌ మోక్షమన్నాలవ
పురుషార్థ మార్జింప బూనుకొనక

పాప భూయిష్ట సంసార కూపమందు
దీప కాంతికి బ్రమసి ఆదీపమనెడి
మృత్యు ముఖమున బడునట్టి మిడుతలట్లు
మమతలకునెల్ల మూలమౌ మాయ జిక్కి
సమయుచున్నారు నరులు సంసారమందు!!

60. గీ॥ క్షణము క్షణమును మన ప్రాణ సముదయంబు
గాగ నున్నట్టి ఆయువు కబళితమయి
కరగుచున్నది మృత్యు ముఖంబునందు
ఇట్టి పరిణామమెవ్వరు కట్టుకదల
నీక పట్టంగ లేరిది నిత్య సత్య
మయ్య గురవయ్య తత్వ విద్యాశ్రయంబె
పరమమౌ రక్షగా త్వరపడు కుమార!
రేపు మాపని కాలంబు మాపకయ్య!!

61. గీ॥ ఆయువున్నంతవరకె యిక్కాయమునకు
తగిన మర్యాద దీనిని జగమెరుంగు
ఎఱిగియును పుట్టి పెరిగిన యింటనున్న
తల్లిదండ్రులు మొదలుగా నెల్లవారి
యందు, పశ్వాదులందు ననంతముగను
అల్లుకొన్నట్టి మమకార వల్లికలను
త్రెంపుకొనలేక మోహంబు చంపుకొనక
మొదలు తుదలేని కాంక్షల మునుగుచుండు!!

62\. కం॥ గురవయ్యా! యీ బోధలు
అరుదోయీ! నేటి కాలమందున సుమతీ!
స్థిర చిత్తత వింటివిగద,
చరితార్ధత గనుము శిష్య సంఘములోనన్!

వ॥ అమృతమయములు, ప్రపన్న పారిజాతములునైన గురు దేవు వాక్యముల శ్రద్ధా సక్తులతో విని గురవయ్య సంసారపు లంపటకు రోసి పూర్ణాశ్రమమునకు తన జీవితము అంకితముగావించి యుండె.

ఉత్తమ భక్తురాలు వక్కెమ్మ (మాలెత)

63\. గీ॥ మొక్కవోనట్టి భక్తితో వక్కెమయను
పంచమ కులస్థురాలు శ్రీ స్వామివారి
సేవలతి భక్తి జేసెడి స్త్రీల యందు
పుణ్యురాలుగా ప్రజల యామోద మందె!

64\. కం॥ తన పూర్వ జన్మముల చే
సిన తపముల వక్కెమాంబ శ్రీ వేంకయ సా
మిని నెల్ల వేళలందున
తని వారగ సేవజేసి ధన్యత గాంచెన్!

కులములు

65. గీ॥ భూమిపై మనుజ జన్మము పుట్టినపుడె
మతము, కులమును లేదు క్రమ క్రమముగ
బ్రతుక నావశ్యకములైన పనులె వారి
వారి వృత్తులె, కులములై మారిపోయె!!

66 గీ॥ వృత్తులకు పుట్టె విద్యలు విద్య నేర్ప
అక్షరాత్మక రచనలు అవతరించె
వాని గూర్చియె చదువులు వాని జెప్ప
దక్షులైనట్టివారె మేధావులైరి!

67. గీ॥ వృత్తి విద్యల నిపుణులై వెలయువారు
చదువులందున విజ్ఞులై పొదలువారు
వీరె ఇరువర్గములునైరి వీరెగాక
తత్త్వవేత్తలు మూడవ తరము వారు!

68. గీ॥ ఈ మూడు వర్గముల మే
ధా మూర్తులు సర్వసంఘ ధర్మాచరణం
బే మూలముగ నొనర్చిరి
నేమంబున గ్రంథ శాస్త్ర నిర్మాణంబుల్!

69. కం॥ అకళంక జీవనంబులు
నకుటిల చిత్తములు గల్గు నాచార్య వరుల్
త్రికరణ శుద్ధిగ జెప్పియు
త్రికరణ శుద్ధిగను నాచరించిరి ఘనులై!

70. కం॥ చనిన చనుచున్న కాలాన స్వార్థపరత
దిన దినము వర్ధమానమై తీవరింప
ఋషులు ఋషికల్పులైన వారిచ్చినట్టి
భవ్య సంస్కృతికే భంగపాటు వచ్చె!

71. గీ॥ వృత్తులే కృత్రిమంబుగ వృత్తి బట్టి
కులములైనట్లు జగదేక గురువరుండు
కృష్ణ భగవానుడే చెప్పె గీతయందు
పరమ భక్తుడు శిష్యుడౌ పార్థునకును!

వ॥ శ్రీ భగవానువాచ:– చాతుర్వర్ణ్యం, మయాసృష్టం, గుణ
కర్మ విభాగశః, అని............

72. గీ॥ ఫల్గునా గుణ కర్మలబట్టి నాల్గు
వర్ణములటంచు నేనె ఏర్పరచినాడ
కులములనుబట్టి హెచ్చు తక్కువల నెవరు
పరిగణించుట లెపుడు భావ్యంబుగాదు!!

73. గీ॥ కులము కొలబద్దగాదని గొలగమూడి
వెంకయస్వామి సెలవిచ్చె విబుధ వరుడు
భవ్య పూర్ణాశ్రమావాస భక్తతతికి
సదమలాదర్శ మౌనని మది దలంచి!

74. కం॥ రాజ్యాంగ నిర్ణయాలనె
వ్యాజ్యంబుల పాలుసేయు వర్ణ విభేదం
బాజ్యం బీర్ష్యా వహ్నికి
త్యాజ్యము సర్వత్ర సర్వదా మన కెల్లన్!

75. గీ॥ భరతదేశాన వర్ణ వ్యవస్థ యనెడు
మఱ్ఱి వృక్షంబమేయ ప్రమాణమునను
విశ్వ భారతదేశాన విస్తరించి
వెలయు నద్దాని కూకటి వ్రేళ్ళతోడ
పెళ్ళగింపగ దలచుట పిచ్చివారి
తలపె। అద్దానిచేగల్గు ఫలము సున్న!!

76. గీ॥ ప్రజకు సుఖశాంతి భద్రతా పాలనమ్ము
చెక్కు చెదరక ప్రభుతయే చక్కగాను
సర్వ మతముల సమతను చాటిచెప్పి
ప్రజల నెలకొన్న భేదభావాలు తొలచి
సర్వ జనులకు నానంద సదనమగుచు
జగతి కాదర్శవంతమై నెగడవలయు!!

ధునికి కట్టెలు దెచ్చు వెంకయ్య

77. ఆ॥ పాతికేండ్ల వయసువాడు మల్లిక వంశ
మందు జననమంది ఆ మహాత్మ
చేయు నగ్ని పూజకై యైన కట్టెలు
కొట్టి ధునికి నిచ్చుకొనెడివాడు!

78. ఆ॥ మనవి చేసికొనియె తనకొక తేలు మం
త్రమ్ము పాము మంత్ర రాజ మొసగ
ప్రార్థనమ్ము చేసె పదపడి వల్లెవది
రెండు వత్సరాల ఖండ సేవ!!

79. ఆ॥ పృధుల భక్తి జేసి వెంకయ్య యానాది;
స్వామి శిష్యులందు వాసి గాంచి
భక్తులాచరించు బహువిధ సేవల
ధునికి కట్టె దెచ్చి వినుతికెక్కె!!

-: త్రాగుబోతును క్షమించుట :-

80. గీ॥ దున్నపోతుల బండిపై ధునికి కట్టె
వేసికొని వచ్చుచుండగా నీసుతోడ
అడ్డగించెను త్రాగుబోతైన యొకడు
చూచె స్వామిజీ కోపపు చూపుతోడ!

81. గీ॥ రాయివలె నిల్చిపోయె నా త్రాగుబోతు
కొంత సేపటిలో మాట కొతుకుబడగ
స్వామి! మన్నించి నన్ను మీపాదదాసు
జేసి కరుణామయాత్మ రక్షింపుడు ప్రభు!!

వ॥ వాని దీనాలాపంబులతో కరుణార్ద్ర చిత్తుడై స్వామి
చల్లని చూపులతో క్షమించె.

82. కం॥ క్షమియింపబడిన మొదలా
శ్రమ సేవలయందు నిర్విరామ విధానన్
శమ దమ సంపత్తుల ను
త్తమ భక్తుడుగాగ మెలగి ధన్యుండయ్యెన్!

-: అవధూతగా స్వామి :-

83. గీ॥ బంధమయమైన సంసార పంకమందు
దిగుట కిష్టములేనట్లు దిరుగుచుండె
ఒక్కొకప్పుడు బాకలి యోగ మనుచు
నొక్కొకప్పుడు మంగలి యోగ మనుచు!

84. కం॥ బాకలి, మంగలి యోగము
లేకాలము నందునేని యెచట వినని యీ
లోకులు అచ్చల క్రంతల
వా కొనగా బూనినారు పలుగాకులుగా!

★

85\. గీ॥ యోగములందు చాకలి యోగమన్న
దైహికంబైన శుచి యేమొ ధార్మికునకు
యోగములయందు మంగలి యోగమన్న
మానసికమైన శుచియేమొ మహిత మతికి!

86\. గీ॥ పిచ్చి వెంకయ్య అనువారె పిచ్చివార
లనుకొనునా యేమొ తాను మహాత్మగాన
జనపదంబులనన్నిట సర్వజనుల
మనసులందున నెలకొన్న మహిత మూర్తి!!

పల్లెలకు దర్శన సాహాయ్యములు

87\. కం॥ తలుపూరు సమీపంబున
గల యూళ్ళను చెర్లోపల్లె గ్రామంబున బై
రులు వానలేక పోవుట
ఘల మల మాడంగ కడుపు మండిన రైతుల్!!

88\. కం॥ ఆపదల దొలగ ద్రోయగ
మాపాలిటి దైవమీవు మహితాత్మా నీ
శ్రీపాద పద్మములనే
ప్రాపుగ సేవించు మమ్ము రక్షింపగదే!!

89. గీ॥ ఎండమావులజూచి నీళ్ళే యటంచు
పర్వులెత్తెడి మూర్ఖుల పగిది మేము
సాధు చిహ్నాలతోడ నిచ్చలు జరించు
వారి నమ్మక చెడినాము వాస్తవమ్ము!!

90. గీ॥ వర్షములు బొత్తుగాలేక పల్లెలందు
గ్రామముల యందు తీవ్రమౌ కఱవు వచ్చె
కఱవు బాధలనుండి రక్షణము సేయ
గొలగముడి వెంకయస్వామి | కొల్తు మార్య!!

91. కం॥ పశువుల పరిస్థితులు మా
వశమా వివరింప సర్వ వశవర్తీ ఆ
పశువులకు ప్రాణ దాతగ
యశమందగ బ్రార్థనము మహామహిమాఢ్యా!!

వ॥ ఇవ్విధంబున కఱవు కఱకు కోరల రక్కసి బారిబడి మొరపెట్టుకొను బక్క రైతులను అబాల వృద్ధము చూచి కూర్చొండుడని చేసైగచేసి వారిలో గొందరచే దండిగా ఎండు కట్టెలు తెప్పించి అప్పటికే సంజ చీకట్లు అలము

కొనుచుండ అగ్నికుండము త్రవ్వించి అందు అగ్నిని ప్రజ్వలింపజేసి నాలుకలు మింటికెగయుచున్న పెను మంటలో అగ్నిపూజసేయ నమకట్టి దీక్ష వహింప రాత్రి వేకువ జాముకు కారు మబ్బులు క్రమ్మి కొండ చిల్లులు పడ్డట్లు ఎడతెరపిలేని వానజల్లులతో ఆప్రాంతమంతయు జలమయంబయ్యె. ఆతెల్లవారి ఇక రైతుల సంబరము గట్లు త్రెంచుకొని స్వాములవారిని తమ చేతుల పైకెత్తు కొనియు, బండ్లు గట్టియు ఊరేగింపుల కోలాహలములు చేసికొనిరి.

అపిమ్మట కొంత కాలమునకు ఒకరు కడుపు పుండుతోనున్న పసికందు నెత్తుకొనివచ్చి....

92. కం॥ పసికందు కడుపు పుండయి
వెస నెత్తురు గ్రక్కుకొనుచు భీకర రుజచే
కొస వూపిరితో నుండగ
అసమాన దయాఢ్యుడైన ఆస్వామి పయిన్!!

93. గీ॥ గట్టి విశ్వాసమున్నట్టి కతన వారి
పాదములమీద ఆపసిపాపనుంచి
అనితర శరణ్యులము ప్రభూ! అనుచు వేడ
తచ్ఛిశువునట్టె తనదు హస్తముల నడ్డ!!

94. గీ॥ మెత్తుకొని బావినీళ్ళపై నెత్తి వేసి
తక్షణమె జవురుకొని భూమి తలముమీద
వెల్లికిల బండబెట్టియు మెల్ల మెల్ల
పొట్ట నొత్తిరి ఆబిడ్డ పొట్టనుండి!!

95. గీ॥ చీము, నెత్తురు నోట విశేషముగను
క్రక్కె; ఆపాప పెనుజబ్బు చక్కబడియె
ధర్మ సంరక్షకుల కసాధ్యం బు గలదె
పోవు ప్రాణాలు నిల్పిన పుణ్యమూర్తి
గొలగముడిస్వామి శ్రీపాద కుసుమములను
ఔదలందాల్చు వారికి లేదు భయము!

పాము కాటుకు చనిపోవనున్న బిడ్డ

96. గీ॥ బిడ్డ చనిపోవుచున్నది పాము గఱచి
వచ్చి దయజూచి కాపాడవలయు స్వామి
బిడ్డపోయిన మాకుటుంబంబు బ్రతుకు
చితికిపోవును వేగ వెంచేయు దేవ!!

97. గీ॥ బఱ్ఱె ప్రతిపూట ఇచ్చేడు పాలతోడ
జరుగుచున్నది మాదు కాపురము స్వామి
దాని ప్రాణాలు నిల్పిన: మాననీయ
నిలుపుకొందుము బ్రతుకు నీ చలువచేత!!

98. గీ॥ పంటలా పండుటలేదు వానలేక
మొన్న రాలిన చినుకుల మొసులెత్తు
వాడు దుంపల దోక్కుడు పార్లతోడ
దోకుకొని తెచ్చి మేపుకొందుము మహాత్మ!!

99. గీ॥ ఇంటి యెలపాడిగా మేము ఎనుములందు
పాడిగొడ్లను ఎన్నెన్నొ పాట్లు పడుచు
బాగ కాపాడుకొనుచు మా ప్రాణములను
నిలుపుకొనుచుంటిమో మహనీయమూర్తి!!

100. కం॥ ఇది మంచిపాడి ఎనుమో
సదయాత్మా! దీని జబ్బు చక్కబరుప, నీ
పదముల సాక్షిగ నిను మా
యెదలందున నిల్పుకొందు మిలు వేలుపుగా!!

101. ఆ॥ వారి తీరుజూచి వరదుడు, వేంకయ్య–
మౌని కొంత తడవు మౌన ముద్ర
పూని యేదొ పసరు పోసెను అబ్బాయి
చెవిని; దానబ్బాయి చేటు దప్పె
స్వామి మహిమచేత బత్తి జీవింపగా
జనుల బరమ సంతసంబు కలిగె!!

ముసలి యానాదికి సాయము

102. గీ॥ భక్త జన మానసోద్యాన భంభ రమ్మ–
స్వామి వెంకయ్య యినకుర్తి గ్రామమందు
వెలసియుండగ జరిగెను వినగదగిన
విషయమొక్కటి వినుడు మీ వీనులలర!!

103. గీ॥ చేత తాటాకు బుట్టయు చినుగులున్న
చీరయును బక్కచిక్కి శరీరమునను
తనువుదాల్చిన కడు పేదతన మనంగ
వచ్చు కప్పల యానాది వనిత జూచి!!

104. గీ॥ పరమ కరుణార్ద్ర చిత్తుడౌ స్వామి తనదు
శిష్యులకు నామె జూపించి చేరబిలిచి
అన్నమును, చీరతోడ రూప్యములు పదియు
నిచ్చి సాదరంబుగను పంపింపుడనియె!!

105 గీ॥ ఆపె మునుపటి జన్మ వృత్తాంతమందు
ప్రథిత మైసూరు రాజుల వంశమందు
పిడికెడన్నంబు మనసార బెట్టదయ్యె
అనుభవింకపోదు పురార్జితంబు!!

గొల్లముడి అడవులలో కట్టెలు కొట్టునపుడు:

106. గీ॥ అగ్నిపూజకు తమకున్న అడవియంత
కొట్టబడుచున్న నూరనున్నట్టివారు
కొందరడవిని నరకుట కూడదనుచు
అడ్డగించిన్ర మరి కొందరనిరి ఇట్లు!!

107. గీ॥ స్వాములకుగద మనయూరికేమి చెడ్డ
మూడునో యోచనలుచేసి చూడుడనుచు
వారిలో వారు మలగుల పడుచునుండ
గ్రామ కరణము తనతీర్పుగాగ చెప్పె!!

108. గీ॥ వేపచెట్లను మాత్రము విడిచిపెట్టి
స్వామి చేసెడి అగ్నిపూజలకు కట్టె
తగ్గకుండగ జేయు టుత్తమము గ్రామ
మంతటికి క్షేమ కరమన్న నందరు విని! —

109. గీ॥ ఔను బాగున్నదీతీర్పు న్యాయమనిరి
గ్రామ కరణమ్మెగాక యాగ్రామ శ్రోత్రి
యేమ్మెదారుగ బల్కు; వెంకయ్యస్వామి
అమృతమయ వీక్షణమ్ముల నాదరించె!

110. గీ॥ అగ్నిపూజకు నరకిన అడవి భూమి
పారిజాతమ్మువలె మీకు సారవంత
సస్య సౌభాగ్యలక్ష్మికి సదనమగుచు
పృధులముగ పంటలిచ్చి సుభిక్షమగును!

వ॥ ఆవిధము కరణము తీర్పు తరువాత ధునికి కట్టెల ఏర్పాట్లు నిరాటంకముగ జరుగసాగె. ఇట్లుండ స్వాములవారు ఉన్నట్టుండి ఎవ్వరికి తెలియకుండ తలుపూరుగ్రామము విచ్చేసినవారి రాకకు గ్రామము ఉప్పొంగిపోవుచు యిట్లు ఆతిథ్యమిచ్చిరి.

111. సీ॥ పిచ్చి వెంకయ్య రావే సంకటున్నది
పెట్టెదరమ్మని పిలిచె నోర్తు
గంజితో గోకుళ్ళు కలబోసి యున్నవి
వడ్డింతురమ్మనె వనిత యొకరు
గొడ్డుకారము దంచుకొంటి నీకును గూడ
ఉన్నది రమ్మను సువిద యొర్తు
జొన్నన్న మెంతొబాగున్నది గోంగూర
కలిపి పెట్టెదనంచు పిలిచె నొకతె

ఈ ప్రకారము కోరిన యెల్లవారి
విందులను నారగించెను వెంకయావ
ధూత; సకలార్తి హరుడు నిర్ధూత విషయి
భక్తకోటికి ముంగొంగు పసిడి యౌచు॥

పరమార్థ సంపాధనకు ఉన్ముఖులజేయు బోధ

112. గీ॥ జగదుపకారార్థము శ్రీ
భగవంతుడు మనుజరూప భాషణముల న
త్యగణిత మహిమా వళితో
సగుణుడుగా నవతరించు సామాన్యులలో॥

113. గీ॥ బాల్య యౌవన కౌమార వార్ధకముల
తనువునను మార్పు వచ్చుట తథ్యమిద్ది;
మార్పులను నిల్వదీజన్మ మరణ మనెడు
భయద దుర్దశ యందును బడును తుదకు॥

114. కం॥ కాలము విధి పరరూపము
కాలములో నాచరించు కర్మల కనువౌ
లీల పునర్జన్మలగన,
జాలుదు దర్శంబులైన జన్మలను సదా॥

115 గీ॥ మనుజ సంఘము చరితార్థ మానవులను
దేవతలటంచు విశ్వాస భావముంచి
పావనములైన భావాల బహుళరీతి
ప్రథిత పుణ్యస్థలాల, దేవస్థలాల
గొలుచు చుందురు భుక్తి ముక్తులనుగోరి.

116 గీ॥ సంపద సుపుణ్యరాశి నష్టాల ఫలము
వాస్తవంబట్టి సంపద్విపత్తి యనెడు
తత్వవేత్తల సూక్తులు తథ్యమైన
సంపదలు వినా గృహము నిస్సారమగును॥

117 గీ॥ మానసిక శుద్ధికై జగన్మాన్యులైన
సిద్ధపురుషుల శుశ్రూష సేయవలయు
దేహసంబంధి వ్యాధుల దీసివేయ
వలయు నన్నను వారినే గొలువ వలయు.

పవిత్ర దేహ పరంజ్యోతి గమనము

118. కం॥ మరణము సర్వ సమానము
ధరపై జన్మించు ప్రాణితతి కెల్లెడలన్
మరణించియు మరణింపని
చరితార్థు లొకొక్కవేళ జనియింతురుగా॥

119. గీ॥ వారికోవకు జెందినవారె గొలగ
మూడి స్వాములు ఈ గ్రామ పూర్వ పుణ్య
రాశిగా నాశ్రమమున నిరంతరంబు
అభయ ముద్రిక తోడ భక్తాళిఁ బ్రోచు.

వ॥ అట్టి పరమ గురునకు పరార్ధ పరునకు స్వపర భేద దూరు
నకు ఆత్మధ్యాన సమాధి స్థితునకు భౌతిక దేహ విమోచన
సూచక విచిత్ర వ్యాధిసోకి మృత్యు వాసన్నమైన నిమిత్త
ములు బహుళముగ నొక్కుమ్మడి క్రమ్ముకొనుటలు నీటిపై
తైల బిందువువలె నాజన పదంబుల నల్లుకొలగా అబాల
గోపాలము ఆశ్రమ మేతెంచి స్వాములవారి తీరు పరికించి
ఆందోళిత మనస్కులై ఈప్రకారము ఎలుగెత్తి విలపింప
సాగిరి.

120. సీ॥ నిత్యాగ్ని పూజా పునీతాత్మ కబళించు
నా, మృత్యు వంచంగ లార్చువారు
ఆర్తార్తి హరుడు మహాత్ముడు కాలగ
ర్భము చొచ్చునాయని వనరు వారు
భవ బంధములు పటాపంచలు చేసెడు
అవధూతకా వ్యాధి యనెడువారు
తీరని వ్యాధుల దృష్టి మాత్రనె వెళ్ళ
నడచు వెజ్జుకు బావ యనెడువారు.

గొల్లముడి వెల్గు లింతలో కుప్పగూలి
కటిక చీకటు లెల్లెడ గ్రమ్మిమనకు
పట్టు గూడని దుర్దశ పట్టెనిపుడు
నకట దిక్కిక మనకు "పూర్ణాశ్రమంబె"

121. సీ॥ బాల్య మాదిగ భవబంధాలు వదలించు
కొనిన వెంకయసామి మనకు లేడె
లౌకిక విషయాల చీకాకు లెఱుగని
వైరాగి మనకు కన్పడడె యింక
సంకల్ప మాత్రాన సకలార్థ దాయియౌ
మూర్తి చేరెనె పంచభూతములను
ఇహలోక యాత్ర చాలించి పరంధామ
గమనమ్ము చేసెనే ఘనతపస్వి॥

అనుచు పరిపరి విధముల వనటబడుచు
ఆ మహాస్వామి యున్న "పూర్ణాశ్రమంబు"
ధామమున కిసుక జల్లిన ధరణి మీద
రాలనట్లుగ నున్న భక్తాళిగుండె
లవిసి పోవగ చింతా భరాత్మలైరి.

122. సీ॥ స్వామి! నీకీకడసారి టెంకాయ స
మర్పించు చుంటి మహానుభావ!
గురుదేవ! ప్రీతిగై కోవె యీ పూదండ
అంతిమాహార సమర్పణంబు
వస్త్రార్థముగ నూత్న వస్త్ర సమర్పణ
మొనరింతు తుది కాన గొనుము దేవ!
శనగపప్పును, బెల్లమును, కొబ్బెరయు దంచి
ప్రియమారగా సమర్పింతు కొనుము
అరటిపండ్లనిన నీకతి యిష్టమని శ్రద్ధ
గొనివచ్చితిని అందుకోవె స్వామి
పరిమళార్థము గంధపొడియు వత్తులు భక్తి
నర్పింతు మీ మహాయానమందు

అట్లు ఆస్వామి అంతిమ యాత్ర జూడ
కనుల గొంతుల నీళ్ళు గ్రక్కదల నోట
మాట పెకలక మనసున మాటుపడక
మొగములను దుఃఖ రూపాన పొంగువారె॥

వ॥ ఆ దుర్దినమున గొల్లముడి గ్రామమున కంట తడిబెట్టని మానవ మాత్రుడు లేడు. ఆ సర్వపూర్ణుని కళేబరమును పూర్ణాశ్రమ కుటీరమునకు ఈశాన్యమున ముమ్ముందు పరమ పవిత్ర క్షేత్రముగా వెలయనున్నచోట సమాధిలో దీర్ఘసమాధి యందున్న మూర్తి నిక్షేపింపబడి తదాది అహర్నిశలు భక్తగణ సందోహ సమ్మర్దముగా జెలువారు చున్నది.

123. తే॥ మరణ మనునది వెంకయ్య గురువరేణ్యు
స్థూల దేహానికేగాని సుస్థిరమగు
ఆత్మకేమాత్రమును లేదు ఆ మహాత్మ
జనన మరణాలులేని తేజంబు జేరె॥

124. తే॥ దేహ మనసుల చింతలు దీర్చు వెజ్జు
"స్వామి వెంకయ్య" అనునది సత్యసూక్తి
నేడు మనమందరము భక్తితోడ జేయు
పరమ వర్ధంతి యేసాక్షి శరణమగును॥

125. గీ॥ భక్తి ముక్తి ప్రదాత నిర్ముక్త విషయి
భక్తజనులకు ముంగొంగు పసిడిమూట
బహువిధార్థార్థి కోటికల్పకము, జన్మ
సార్థకము జేసికొన్న మహాగ్ని హోత్రి॥

126. గీ॥ భవ్య పూర్వాశ్రమా వాసమవ్యయంబు
సచ్చిదానందమయము విశ్వస్యసృష్టి
స్థితి లయాత్మక నిత్యదేదీప్యమాన
సత్యతేజమే సర్వరక్షణము మనకు॥

127. గీ॥ మన కనగా నెవ్వరికన
మనసా పక్షియించువాక్కు మనసావచసా
తనునా స్మరించుధన్యులు
ఘనముగ వెంకయ్యస్వామి కరుణకు పాత్రుల్

ఫలశ్రుతి

128.ఆ।వె। పుణ్యమూర్తి గొల్లముడి స్వామి జీవిత
సంగ్రహంబు నెవరు శ్రద్ధతోట
భక్తితోడ నిత్య పఠనంబు శ్రవణంబు
చేయగలరొ వారె హాయి గూర్చు
విజయ భోగభాగ్య విభవాభివృద్ధుల
బడయగలరు స్వామివారి కరుణ
నిత్య సత్యమిద్ది నెఱనమ్మి పైరీతి
స్వామి సేవ నతుల ఫలము గనుడు॥

సర్వ మానవ కళ్యాణము

129. గీ॥ మానవత్వంబు మనలోన మనిన వఱకు
భేదభావాలు మనలోన బాదుగొనవు
భారతీయు లనంగ సర్వప్రపంచ
మానవులు దైవభావమె వ్యాపియందు

130. నిలిపి సేవింతురో వాని గొలుచువాడు
అన్ని మతములవారి కారాధ్యుడగుచు
కాలమున్నంత వఱకు సుపాలనమ్ము
రక్షణము సేయునా జగద్రక్షకుండు

సర్వజనులు ఆరోగ్యవంతులుగా
సుఖవంతులుగా నుందురుగాక॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఈ రచనకు మూలసూత్ర విపులికరణ కర్తల గూర్చి కృతజ్ఞతా
పూర్వక అభినందన అభివందనములు.

పెసల వంశ్యుడు శ్రీ సుబ్బరామయ్య

1. స్వామి చరితామృతమ్ము నాస్వాద పరచి
సూచన ప్రాయముగ తాను చూచినట్టి
విన్నయట్టివి కొన్నిటి విశదపరచి
ధన్యతా సిద్ధిగాంచె విద్యా గురుండు
పెసల శ్రీ సుబ్బరామయ్య అసదృశముగ॥

2. సార్థక "ఆచార్య" బిరుద భూషితుడు శ్రీ అక్కిరాల
భరద్వాజ పండితకవి విరచిత అవధూత లీలలు
ఆధారంగా అవధూత వేంకయ్య స్వామి భవ్య చరిత
గావించి ధన్యుడయ్యె

తే॥ సుబ్బరామయ్య వ్రాసిన సూత్రరూప
స్వామి జీవిత చరిత కాచార్య బిరుద
అక్కిరాల భరద్వాజ అను సుధీంద్రు
రచన "అవధూతలీల" తద్రచన యందు
కొన్ని పద్యసుమాలుగా కూర్చినాడ॥



ముద్రణ : నవత ప్రింటర్స్ - నెల్లూరు. వెల :